సంతోష్‌రెడ్డికి సేవారత్న నేషనల్ అవార్డు



మల్లాపూర్: సంఘ సేవకులు, మాజీ సైనిక అధికారి నాచారం ప్రాంతానికి చెందిన మామిడాల సంతోష్‌రెడ్డి సేవారత్న 2024 నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ ప్రకటించింది. అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని సోమవారం అందజేశారు. 11వ తేదీన ఏపీలోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సమావేశంలో సేవారత్న అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్, రాష్ట్ర కో ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు ఉన్నారు.

నియామకం


ఉదయ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న పోలేపాక అంజయ్య

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రాయిని ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య సోమవారం ఉదయ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసంతో ప్రధాన కార్యదర్శిగా నియమించిన పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అభినందనలు


అభినందిస్తున్న మందుముల పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: హబ్సిగూడకు చెందిన సోమ్‌లాల్ నాయక్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేయడాన్ని హర్షిస్తూ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సోమవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గణేష్ నాయక్ స్థానికులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్


కమలం పువ్వు గుర్తు వేస్తున్న వీరేందర్‌గౌడ్, కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: మరోసారి మోదీ సర్కార్ అనే నినాదంతో సోమవారం బీజేపీ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్‌లు హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లో గోడలమీద బీజేపీ కమలం పువ్వు గుర్తును వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇక ఆహ్లాదకరంగా హైకోర్టు కాలనీ చెరువు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ హైకోర్టు కాలనీ హెచ్‌ఎంటీనగర్ చెరువులో గుర్రపు డెక్కను తొలగించి ఆహ్లాదకరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం హెచ్‌ఎంటీనగర్ చెరువు హైకోర్టు కాలనీ వైపు ఉన్న చెరువులో గుర్రపు డెక్కను జీహెచ్‌ఎంసీ సిబ్బందితో తొలగిస్తున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్కతో దోమలు వృద్ధి చెందుతాయని వాటిని సైతం నిర్మూలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, ఏఈ నరేష్‌రెడ్డి, హైకోర్టు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, కాపాడే వారే కబ్జాలకు పాల్పడుతున్నారని పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. ఆయన మాట్లాడుతూ పర్వతాపూర్‌లో శ్మశానవాటిక, డంపింగ్ యార్డులకు కేటాయించిన సర్వే నంబర్–1, 10, 11లోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయని ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ నాయకులతో కలిసి తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ముదిగొండ రమేష్, మజర్, నాగరాజు, ఉదయ్‌రాజ్ గౌడ్, అమర్, కరీం, జాకీర్‌హుస్సేన్, చార్లెస్, హసన్ చాచా, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి



మేడిపల్లి: అనగారిన వర్గాలకు విద్యను దూరం చేసే, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్‌శ్రీరంగరాజ్ పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సోమవారం ఉప్పల్ బస్ డిపోవద్ద సంతకాల సేకరణ చేపట్టారు. దినేష్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు క్రాంతి, నరేష్, రెహమాన్, నెల్లి సత్య, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు అరవింద్, శివ, రాము, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిపై బురద చల్లడం తగదు

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు. సోమవారం ఆనంద్‌బాగ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు అశోక్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, పిట్ల శ్రీనివాస్, జీఎస్వీ సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ మల్కాజిగిరిలో మైనంపల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసునన్నారు. డబ్బుకు మంచితనానికి జరిగిన పోటీలో మంచితనం ఓడిపోయిందన్నారు. బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడిన మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. గ్రేటర్‌లో బీఆర్‌ఎస్‌కు అత్యధిక సీట్లు వచ్చాయంటే మైనంపల్లి గ్రేటర్ అధ్యక్షుడిగా పార్టీ పటిష్టతకు చేసిన కృషి వల్లనేనని మర్చిపోయారన్నారు. మల్కాజిగిరిలో ఆ పార్టీ కార్పొరేటర్లు అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై ప్రజలే తిరగబడుతుంటే.. మైనంపల్లిపై బురద చల్లడం తగదన్నారు. బి.కె.శ్రీనివాస్, సంపత్‌గౌడ్, ప్రవీణ్, వినోద్‌యాదవ్, సానాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రంగుమారి నురగలు కక్కుతున్న బోర్ వాటర్




నిర్లక్ష్యాన్ని ఏమ'నాలా'..?

మల్లికార్జుననగర్‌కు కాలుష్యం కాటు

- నిత్యం నాలాలో పారుతున్న కెమికల్స్
- గంటకో రంగు మారుతున్న మురుగు
- భూగర్భ జలాలు సైతం కలుషితం
- ఉదయం, సాయంత్రం దుర్వాసన
- మొద్దునిద్రలో సంబంధిత అధికారులు
- ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు


నిరసన వ్యక్తం చేస్తున్న మల్లికార్జున నగర్ ప్రాంతానికి చెందిన స్థానికులు

నాలాలో రంగు మారుతున్న నీరు



ఉప్పల్: ఉప్పల్ సర్కిల్, బోడుప్పల్ మున్సిపాలిటీకి బార్డర్‌లో ఉన్న ఉప్పల్ డివిజన్ మల్లికార్జుననగర్ వాసులు కాలుష్యం కాటుకు విలవిల్లాడుతున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు వందలాది కుటుంబాల వాసులు నాలుగు నెలల నుంచి అనేక అవస్థలు పడుతున్నారు. కాలనీపై పగబట్టినట్లుగా ఉదయ తెల్లవారు జాము నుంచి మొదలు ఉదయం 10 గంటల వరకు తిరిగి సాయంత్రం 6 గంటల నుంచి నాలా నుంచి వచ్చే కెమికల్స్ ఘాటైన వాసనతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అధికారులకు, పాలకులకు సమాచారం ఇచ్చినా ఎవరూ వచ్చి చూసిన పాపాన పోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- బోడుప్పల్ చెరువు మీదుగా ఆంజనేయనగర్ నుంచి ఉప్పల్ నల్ల చెరువులో కలిసే ఓపెన్ నాలా మల్లికార్జుననగర్ మీదుగా వెళ్తోంది. దాదాపు 10 కాలనీలను తాకుతూ ఈ నాలా పారుతోంది. కాగా కొంత మేర బోడుప్పల్ మున్సిపల్ పరిధిలో నాలా భాగాన్ని బాక్స్ కల్వర్టులు కట్టి మూసి వేయడంతో ఈ సమస్య కొన్ని కాలనీలకు తక్కువగా ఉంటోంది.
- మల్లికార్జున నగర్‌లో మాత్రం గతంలో నాలా నుంచి అప్పుడప్పుడు వచ్చే ఘాటైన వాసనలు ఈమధ్య కాలంలో నిత్య కృత్యమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు వాసనకు నిద్రపట్టడం లేదని, వృద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారు జామున ఒక రంగు, ఉదయం 6 గంటలకు ఇంకో రంగు ఇలా నాలాలో మురికి నీరు గడియకో రంగు మారుతూ పారుతుండటంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.
- ఇంట్లో గృహోపకరణాలు తుప్పుపడుతున్నాయని, జువెలరీ, నగలు సైతం నల్ల బడుతున్నాయని, బోరు నీరు తాగే పరిస్థితి కూడా లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామికవాడల్లో కెమికల్ వ్యర్థాలను సరైన పద్ధతుల్లో ట్రీట్‌మెంట్ చేయకపోవడం, నాలాలోకి కెమికల్ వ్యర్థాలను రాత్రి వేళలో వదలడం వంటివి ఈ మధ్యకాలంలో ఎక్కువ అవుతున్నాయని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాలు సైతం కలుషితం

భూగర్భ జలాలు సైతం కలుషితం అయ్యాయని, ఏ ఇంట్లో చూసినా బోరు నీరు గోధుమ రంగులో మారడంతో పాటు నీటిలో నురగలు వస్తున్నాయని స్థానిక కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు కోటిరెడ్డి, సత్తిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సరైన సమయంలో కాలుష్యాన్ని అరకట్టాలని, లేనిపక్షంలో కాలనీలోని కుటుంబాలన్నీ రోడ్డెక్కి ఆందోళన చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరి



నాలా నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ఘాటైన వాసనలు వస్తున్నాయని, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ఇలా వ్యవహరిస్తే ఎలాంటి ఆందోళనకైనా సిద్ధం.

– పరమేశ్వరి, మల్లికార్జుననగర్.

నాలాలోకి పారిశ్రామిక వ్యర్థాలు



గత నాలుగు నెలలుగా ఆరోగ్యం పాడైంది. గొంతులో నొప్పి, జలుబు ఇలా ఏం జరుగుతుందో తెలియడం లేదు. పచ్చని కాలనీకి కాలుష్యం బెడద పట్టుకుంది. నాలాలో పారిశ్రామిక వ్యర్థాలను వదలడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది.

– నారాయణరెడ్డి, మల్లికార్జున నగర్ కాలనీ

అధికారులు అమ్ముడు పోయారా..?



ఘాటైన వాసనలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాం.. అనేక సార్లు అధికారులు, ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూనే ఉన్నాం. వారు అధికారులకు చెప్పారు. కానీ అధికారులు ఎందుకు రావడం లేదు. ఏడేళ్ల క్రితం మల్లాపూర్ పారిశ్రామికవాడ నుంచి మల్లికార్జున నగర్ మీదుగా కెమికల్ నాలాను తీశారు. అప్పుడు ఆందోళన చేసినా ఫలితం లేదు. ఇప్పుడు అధికారుల నిఘా కరువైంది.

– సత్తిరెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి

పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం



ఇప్పటికే అనేక సార్లు ఫిర్యాదు చేశాం. అధికారులు వెంటనే స్పందించి నాలాకు పై స్లాబ్ వేస్తారా.. లేక కెమికల్ వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకుంటారో వారే తేల్చుకోవాలి. లేనిపక్షంలో మహిళలంతా నడుంబిగించి రోడ్డెక్కి ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కేజీ రూప, స్థానికురాలు

సామాజిక సేవలోనూ సంఘాలు పాల్గొనాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


యాదవ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

రామంతాపూర్: యాదవ సంఘం రూపొందించిన కేలండర్‌ను స్థానిక యాదవ భవనంలో సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బండారి శ్రీవాణి వెంకట్‌రావు, బొంతు శ్రీదేవి యాదవ్, యాదవ సంఘం నేత సర్వ బాబు యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల సంఘాలు తమ సామాజికవర్గం అభివృద్ధితో పాటు సమాజసేవలోనూ పాల్గొనాలని సూచించారు. యాదవ సంఘం అధ్యక్షులు బొడ్డు బాలయ్య యాదవ్, శ్రీనివాస్ యాదవ్, అశోక్ యాదవ్, రఘు యాదవ్, రాజు యాదవ్, నర్సింహ యాదవ్, నరేష్ యాదవ్, భిక్షపతి, వినోద్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యా వైద్యానికి ప్రాధాన్యం


విశ్వశాంతి హైస్కూల్ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: అరవింద్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన 30వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో విద్యా, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రూపారాణి, డైరెక్టర్ వెంకటేశం, మాజీ ఏసీపీ అశోక్ చక్రవర్తి, నాగేశ్వర్‌రావు, డాక్టర్ బీవీ చారి, మల్లయ్య, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

చర్లపల్లి టెర్మినల్ బాధితులకు పరామర్శ


బాధితులతో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ బాధితులను సోమవారం మానవ హక్కుల వేదిక ప్రతినిధులు పరామర్శించారు. టెర్మినల్‌కు వెళ్లే రోడ్డు మార్గం విస్తరణలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని అండగా ఉంటామన్నారు. మహాలక్ష్మీనగర్, భరత్‌నగర్ కాలనీలకు చెందిన బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. టెర్మినల్‌కు వెళ్లేందుకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నా ఇళ్లను కూల్చివేసి రోడ్డు విస్తరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత పెద్ద నిర్మాణం చేసే క్రమంలో ప్రభుత్వం, అధికారులు ప్రజాసేకరణ చేపట్టాల్సి ఉండేదని అన్నారు. రైల్వే అధికారులు ఏకపక్షంగా వ్యవహరించకుండా బాధితుల సూచనలను పరిగణలోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్, సామాజిక కార్యకర్త పి.శంకర్, నగర కమిటీ సహాయ కార్యదర్శి టి.రోహిత్, వెంకటనారాయణ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి



అల్వాల్: ప్రజావాణిలో అందిన సమస్యలను పరిష్కరిస్తానని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో పలు సమస్యలపై దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, జలమండలికి సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు అందచేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ జయంతి

గౌతంనగర్: సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం గౌతంనగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బలరాం, సుజాత, స్వర్ణలత, బండారి రవి, రాజేష్, అమర్, నాగరాజు, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, శ్రీనివాస్, చారి, సాగర్, గౌతమ్ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా సంతకాల సేకరణ


చర్లపల్లి పారిశ్రామికవాడలో సంతకాల సేకరణలో సీఐటీయూ నాయకులు

కుషాయిగూడ: ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికులు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ బంద్‌ను తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, చర్లపల్లి అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.సత్యనారాయణ, జి.శ్రీనివాసులు, వీరయ్య, రసూల్, కోదండరాముడు, గంప నారాయణ, శివ, శ్రీనివాస్, మధుసూదన్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి


ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పెండింగ్ పనులపై సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే శంకుస్థాపన జరిగిన గాంధీనగర్ కల్వర్టు, ఐజీ కాలనీ అప్రోచ్‌రోడ్డు, కుషాయిగూడలో రోడ్ల పనులపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డివిజన్‌లో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అందుబాటులోకి పోస్టల్ సేవలు


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న పోస్టల్ అధికారి హైమావతి

ఉప్పల్: పోస్టల్ లైఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్లెయిమ్ సెటిల్‌మెంట్ పాలసీ ద్వారా హైదరాబాద్ ఆగ్నేయ మండల ఎస్‌ఎస్‌పీ హైమావతి సోమవారం ఉప్పల్ పోస్టల్ కార్యాలయంలో డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ చెక్‌ను లబ్ధిదారులు మున్నీరా బేగంకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయన్నారు. పోస్టాఫీసులో అధిక బోనస్ వచ్చే పీఎల్‌ఐ, ఆర్‌పీఎల్ సేవలను ప్రజలు విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ప్రీమియమ్ చెల్లించుకునే వెసులుబాటు కూడా అందుబాటులో ఉందన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


మల్లాపూర్ ఎస్వీనగర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ ఎస్వీనగర్ నుంచి భవానీనగర్ రోడ్ నంబర్–5 పెద్ద నాలా వరకు రూ.27 లక్షలతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేపడుతున్నామని తెలిపారు. పనులను కూడా వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్, డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, స్థానిక కాలనీవాసులు నెమలి రవికుమార్, శ్రవణ్, రవిచారి, యాదగిరి, అనిల్, బీఆర్‌ఎస్ నేతలు వాసుగౌడ్, కటార్ల భాస్కర్, హమాలీ శ్రీను, కుంటి కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీను, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

ఉప్పల్: విద్యుత్ వినియోగదారులు మీటర్ రీడింగ్ తీసుకునే వారికి గృహజ్యోతి పథకం అమలుకు రేషన్, ఆధార్ వివరాలు ఖచ్చితంగా ఇవ్వాలని ఉప్పల్ విద్యుత్ అధికారి బాలకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరిస్తేనే గృహజ్యోతి అమలుకు వీలవుతుందని, అందరూ సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

డ్రైనేజీ నిర్మాణం తర్వాతే రోడ్లు


భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం వీఎస్‌టీకాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రోడ్లు వేయిస్తామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వీఎస్‌టీకాలనీలో రూ.10 లక్షలతో కొనసాగుతున్న పనులను సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు. నాణ్యత పాటిస్తూ ఛాంబర్‌లను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీవరేజ్ సూపర్‌వైజర్ రాకేష్, బీఆర్‌ఎస్ నేతలు సుగుణాకర్‌రావు, కట్ట బుచ్చన్నగౌడ్, సువర్ణ తదితరులు ఉన్నారు.

బైపాస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



రామంతాపూర్: బైపాస్ రోడ్డులో ఇటీవల నూతనంగా ప్రారంభించిన ఆస్తుల రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదురుగా నాలా పక్కన తాత్కాలికంగా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న టీ స్టాల్ టిఫిన్ సెంటర్ల షెడ్లను సోమవారం ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు మాట్లాడుతూ నాలా స్థలాలు కబ్జా చేసుకుని వ్యాపార గృహ సముదాయాలు నిర్మించుకున్న బడాబాబులను వదిలేసి తాత్కాలికంగా చిన్న చిన్న షెడ్లు వేసుకుని ఎవరికీ ఇబ్బంది లేకుండా వ్యాపారం చేస్తున్న తమను అధికారులు వేధిస్తూ తమ షెడ్లను తొలగించడం అన్యాయం అని వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామన్నారు.